చెత్త శుద్ధి ఏది?



పాడేరు రేకుల కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు



పాడేరు ఐటీడీఏ క్యాంటీన్ సమీపంలో చెత్తకుప్పల వద్ద పశువులు

- డంపింగ్ యార్డుల్లా వీధులు
- రోజుల తరబడి తొలగించని చెత్త
- దుర్గంధంతో సతమతం
- ప్రబలుతున్న రోగాలు
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

పాడేరు రూరల్: జిల్లాలో చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం కొరవడింది.అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వృద్ధి చెందుతున్నాయి. రోగాలు ప్రబలే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛాంధ్ర వంటి కార్యక్రమాలతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని , ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం ప్రజలపాలిట శాపంగా మారిందని చెబుతున్నారు.

పాడేరు మండలంలోని (పిఎంఆర్‌సి) రేకులకాలనీ, ఐటిడిఏ పీవో కార్యాలయం వెనకాల పరిసరాల ప్రాంతాలతో పాటు, పట్టణంలోని ఐటీడీఏ క్వార్టర్స్, సుండ్రుపుట్టు, లోచల్లిపుట్టు, డిగ్రీ కళాశాల సమీపం, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, చాకలి వీధి, పాత పాడేరు, గొందూరు తదితర ప్రాంతాల్లో వారం రోజుల నుంచి చెత్త తొలగించపోవడంతో డంపింగ్‌యార్డులా మారాయి. కుప్పలు కుప్పలుగా చెత్త దర్శనమిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వర్షపునీరు, డ్రైనేజీల్లో మురుగునీరు, చెత్తలతో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముక్కుమూసుకొని రాకపోకలు సాగిస్తున్నామంటున్నారు. ఆయా ప్రాంతాల మీదుగా పంచాయతీ అధికారులు రాకపోకలు సాగిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. దోమలు వృద్ధి చెందడంతో కంటి మీద కునుకు ఉండడం లేదని, రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



డుంబ్రిగుడలో డ్రైనేజీ దుస్థితి



మాచ్‌ఖండ్ ప్రాజెక్టుకు వెళ్లే రహదారిపై పేరుకుపోయిన చెత్త, మురుగునీరు

అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి చెందిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకు చెత్త, మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. మాచ్‌ఖండ్ ప్రాజెక్టుకు వెళ్లే ఒనకఢిల్లీ ప్రధాన మార్గంలో ఇరువైపులా డ్రైనేజీకు ప్రాజెక్టు అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా పనులు మాత్రం నాసిరకంగా చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో డ్రైనేజీ పనులు చేసిన కొద్ది రోజులకే పాడైపోవడం, పూడికపేరుకొని మూసిపోవడం వంటి జరుగుతున్నట్టు చెబుతున్నారు. మండలంలో బుధవారం కురిసిన వర్షాలకు డ్రైనేజీ అంతా మూసుకుపోయి ఉండడంతో చెత్త, మురుగునీరు రోడ్లపై వచ్చి అధ్వానంగా తయారైంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షానికై డ్రైనేజీ పరిస్థితి ఈ విధంగా ఉంటే రానున్న వర్షకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఒనకఢిల్లీ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని వారు కోరుతున్నారు.



జీకే వీధిలో కాలువలో చెత్త, వాటర్‌బాటిళ్లు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని మురుగు కాలువల్లో పూడిక తీయక అధ్వానంగా ఉన్నాయి. ప్లాస్టిక్ వస్తువులు, వాటర్ బాటిళ్లు, చెత్తచెదారాలతో దర్శనమిస్తున్నాయి. మురుగునీరు ప్రవహించకుండా నిల్వ ఉండిపోతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా మారింది. రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. దుర్గంధంతో ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దోమలు వృద్ధి చెందడంతో రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

క్షీణించిన పారిశుధ్యం

దుంబ్రిగుడ: మండలంలోని పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోడ్లపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. మండలంలోని 18 పంచాయతీల్లో సుమారు 60 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఏ పంచాయతీలోనూ డంపింగ్ యార్డులు లేవు. పంచాయతీల అధికారులు పారిశుధ్యంపై దృష్టిసారించడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని గ్యాస్ గోడౌన్ వద్ద డంపింగ్ యార్డు ఉండేది. దీంతో పెట్రోల్ జీసీసీ జీఆర్ డిపో వద్ద ఆరోగ్యకేంద్రం రోడ్డు వద్ద, గుంటసీమ రహదారి వద్ద చెత్తను పడేస్తున్నారు. అరకు గ్రామ మేజర్ పంచాయతీలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. ప్రధానంగా వారపుసంత నిర్వహించే షెడ్ల వద్ద పారిశుధ్యం కొరవడింది. తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. సంతకు వచ్చే గిరిజనులు, వ్యాపారులు ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. ఈగలు వృద్ధి చెంది సంతలో విక్రయించే తినుబండారాలు, ఇతర ఆహారపదార్థాలపై ముసురుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ చిన్నబాబు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి ఔట్ పోస్టు వద్ద ఎస్‌ఐ చినబాబు ఆధ్వర్యంలో బుధవారం ముమ్మర వాహన తనిఖీలు జరిగాయి. వాహన పత్రాలు లేని వారికి అపరాధ రుసుము విధించారు. కౌన్సిలింగ్ ఇచ్చి మరోసారి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వ్యాన్‌లు, ఇతరత్రా వాహనాల్లో సరకులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పీఎస్‌ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పాకపై కూలిన ప్రహరీ



తాటాకు ఇంటిపై కూలిన ప్రహరీ

అడ్డతీగల: భారీ వర్షానికి బుధవారం అడ్డతీగలలోని టీచర్స్ కాలనీలో రెడ్డి కృష్ణ అనే వ్యక్తికి చెందిన ఇంటి ప్రహరీ పక్కనే ఉన్న తాటాకు ఇంటిపై కూలింది. దీంతో మడకం చిన్నాలమ్మ, శ్రీనులకు చెందిన తాటాకిల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఆ సమయానికి గోడ సమీపంలో ఎవ్వరూ లేకపోవడం వల్ల ప్రాణ నష్టం జరగలేనట్టు స్థానికులు చెప్పారు. ఈ గోడ పక్కనే ఉన్న మట్టి భారీ వర్షానికి కొట్టుకుపోవడంతో గోడ కూలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: స్థానిక పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో నడిగట్ల ప్రకాష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నూకరాజు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని డ్రైనేజీల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీల కోసం తవ్విన పెద్దపెద్ద గోతుల్లో మురుగునీరు నిల్వ ఉండటం వలన దోమల నివారణకు ఈ పనులు చేపట్టారు. హెల్త్ అసిస్టెంట్‌లు శోభన్‌బాబు, గిరిధర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారికి పాముకాటు



చికిత్స పొందుతున్న చిన్నారి

అడ్డతీగల: మండలంలోని చిన్న వడిశకర్ర గ్రామంలో జంపా కృష్ణదేవి అనే 11 ఏళ్ల బాలిక బుధవారం పాముకాటుకు గురైంది. వై.రామవరం మండలం బూరుగుపాలెనికి చెందిన ఈ బాలిక అమ్మమ్మ ఇంటికి వచ్చింది. బాలిక ఆడుకుంటుండగా పాముకాటేసింది. బంధువులు హుటాహుటిన బాలికలు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు సత్కారం



జవాన్ అశోక్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజాం గ్రామంలో ఆర్మీ జవాన్ నడిపల్లి అశోక్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. బుధవారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఆకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్మీ జవాన్‌ను సత్కరించారు. ఇటీవల పాకిస్తాన్ యుద్ధం చేసిన బోర్డర్ దగ్గరలోనే అశోక్ విధులు నిర్వహిస్తున్నాడు. గత నాలుగేళ్లుగా జమ్ముకాశ్మీర్, శ్రీనగర్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అశోక్ మంగళవారం రాత్రి స్వగ్రామం రాజాం చేరుకున్నాడు. దేశ సేవలో పాల్గొంటున్న అశోక్‌ను జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామ యువకులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పహల్గాంపై పాకిస్తాన్ దాడి చేసి టూరిస్టులను పొట్టన పెట్టుకోవడం పిరికిపంద చర్య అని, భారతదేశాన్ని కాపాడుకోవడానికి శక్తివంచన లేకుండా పోరాటాలు చేస్తామని జవాన్ అశోక్ తెలిపారు. జై జవాన్ , జై కిసాన్ అంటూ యువకులు గ్రామంలో నినాదాలు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఇతర అధికారులు



చింతపల్లిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు

గూడెంకొత్తవీధి: యోగాంధ్ర ప్రచార పోస్టర్‌ను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వైద్యులు అచ్యుత్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దావీద్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం నుంచి జంక్షన్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగా వల్ల కలిగే యోగా ఆరోగ్య లాభాలను వివరించారు.

చింతపల్లి: మండలంలో అంతర్జాతీయ యోగా క్యాంపియన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. యోగా దినోత్సవాన్ని పురష్కరించుకొని చింతపల్లిలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ నెల 21 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధిగా పాల్గొవాలన్నారు. ఏటీడబ్ల్యూవో జయనాగలక్షి తదతరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తిరంగా ర్యాలీ



జాతీయ జెండాతో దుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీలు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై తిరంగా ర్యాలీని అధికారులు బుధవారం చేపట్టారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై మండల కేంద్రంలో 75 అడుగుల జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. సరిహద్దులో జవాన్లు సురక్షింతగా, క్షేమంగా ఉండాలని, ఇటీవల యుద్ధంలో అశువులు బాసిన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. మోదకొండమ్మ అమ్మవారి ఆలయం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పార్టీ మాజీ అధ్యుడు రాజారావు మాట్లాడుతూ పెహెల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దాడులకు ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి భారత్ సత్తా ఏమిటో తెలిసిందన్నారు. నాయకులు బాలకృష్ణ, మత్స్యకొండబాబు, వేమన, గాసన్న, వెంకటరమణ, పాండు పాల్గొన్నారు.

రామాయణంపై అవగాహన

కశింకోట: రామాయణం మహా కావ్యమని, దీని గురించి ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పర్చుకోవాలని తాళ్లపాలెం గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం తెలిపారు. తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామాయణం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ రాముని మార్గం అనుసరణీయమన్నారు.

విస్తారంగా మిరప, నువ్వు పంటల సాగు



దాలివలసలో సాగులో ఉన్న మిరపచేను



పూత పంట దశలో నువ్వు చేను

కె.కోటపాడు : మిరప పంటను మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరపపంట సాగు కాలంలో 10 రోజులకు ఒక్కోసారి నీటి తడుపు అందించాలని, ఈ విధంగా సాగు చేపడితే మొక్కనాటిన 45 రోజులకు మిరప పంట పూతదశకు చేరుకుని దిగుబడి ప్రారంభం అవుతుందని సాగు రైతులు తెలుపుతున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలో మంచి లాభాలు పొందగలమని రైతులు చెబుతున్నారు. మండలంలో దాలివలస, పిండ్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 90 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నారు.

నాతవరం : మండలంలో ఈఏడాది నువ్వు పంట ఆశాజకంగా ఉంది. గత ఏడాదితో పోల్చుకుంటే నువ్వు పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. మండల వ్యాప్తంగా 922 ఎకరాల్లో నువ్వులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నువ్వు చేను పూత దశలో ఉండగా కొన్ని చోట్ల పంట దశలోకి చేరువలో ఉంది. నువ్వుల ధర కూడా మార్కెట్లో 100 కేజీల బస్తా రూ.10వేలకు పైగా పలుకుతుంది. నెల రోజుల వ్యవధిలో నువ్వు పంట చేతికందే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. నువ్వు పంట దిగుబడి బాగుంటే మంచి ఆదాయంతో ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు

గంగవరం : స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం ఆవరణలో పూజా కార్యక్రమాలు, కోలాటం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలను వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు రాంబాబు, సిద్ధూ, రాజు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఏజెన్సీలో నూరుశాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురాం, నాయకుడు గురునాయుడు

దుంబ్రిగుడ: ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కనీసం ప్రస్తావించకపోవడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. పరశురాం, వంతాల గురునాయుడు అన్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీలకు న్యాయం జరగాలంటే ఏజెన్సీలో వంద శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎన్నికల హామీ ప్రకారం సీఎం చంద్రబాబు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదానది తీరాన గల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలకు వేదిక కానుంది. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. స్థానిక అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో పది నాటికలను ఎంపిక చేసి, ప్రదర్శనకు సన్నాహాలు చేశారు. ప్రతి రోజూ రాత్రి 8.30 గంటల నుంచి పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు యువ భేరి థియేటర్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) వారి 'నా శత్రువు' నాటిక, బీవీకే క్రియేషన్స్ (కాకినాడ) వారి 'తితిక్ష' నాటికలను ప్రదర్శించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు తెలిపారు. తమ పరిషత్ ఏర్పాటు అయిన తర్వాత ఐదో విడతగా నిర్వహిస్తున్న పోటీలను ఎప్పటిలాగే విజయవంతం చేసి, ప్రోత్సాహం అందించాలని కోరారు.

లచ్చన్నపాలెంలో వైభవంగా హోమాలు

మాకవరపాలెం: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లచ్చన్నపాలెంలో ప్రత్యేక హోమాలు, పూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతి కావడంతో మండలంలోని లచ్చన్నపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి గ్రామంలో హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం నేడు

దేవరాపల్లి : పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం కాలనీలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. గురువారం తెల్లవారజాము నుంచి స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన, సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

ఘనంగా గంగాలమ్మ పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి గ్రామంలో ఎస్టీ కాలనీలో గంగాలమ్మ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తొలుత గ్రామదేవతలు దూబాలమ్మ, దుర్గాదేవి, ఏడూళ్లమ్మ ఆలయాల వద్ద భక్తులు పసుపుకుంకుమలు, నూతన వస్త్రాలు, పిండివంటలను అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డప్పువాయిద్యాల నడుమ స్థానికులు సందడి చేశారు. వేడుకలో భాగంగా నిర్వహించిన నందులాట, థింసా నృత్యం, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకొన్నారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పాపారావు, కాసులమ్మ. బంగార్రాజు, శ్రీనివాసు, భీమరాజు తదితరులు వేడుకలను పర్యవేక్షించారు.

పొంచి ఉన్న ప్రమాదం



నందిగామ బ్రిడ్జి మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదలు

- రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని వైనం
- ఆందోళనలో వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

ఎటపాక: భద్రాచలం, కూనవరం ప్రధాన రహదారి పలుచోట్ల ప్రమాద భరితంగా ఉంది. రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో ప్రమాదకర మలుపులుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ దారిలోని మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో గమనించని వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని జంగిల్ క్లియరెన్స్

మండల పరిధిలోని గౌరిదేవిపేట బస్టాండ్ సమీపంలో నందిగామ బ్రిడ్జి మలుపు వద్ద ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అసలే మలుపు ఆపై ముళ్లపొదలతో ఇబ్బంది పడుతూ వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారి పాపికొండలకు వెళ్లే మార్గం కావడం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో గన్నవరం నుంచి నందిగామ వరకు పలుచోట్ల రహదారిని మూసేసే విధంగా ముళ్లపొదలు పెరగడం ఆటంకంగా మారింది. ఈ దారిమీదుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా ప్రమాదాల నివారణకు కనీసం పట్టించుకోవడం లేదని వాహనచోదకులు చెబుతున్నారు. రాత్రిళ్లు ఈ దారిలో ప్రయాణం భయంగా మారిందని, ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోవడంతో చీకట్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

మండలంలోని భద్రాచలం-కూనవరం రహదారిపై పలుచోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవు. దీంతోపాటు ఈ మార్గంలోని నందిగామ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా ఫలితం ఉండడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈ మార్గంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంతో పాటు ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి.

– అప్పారావు, గౌరిదేవిపేట, ఎటపాక మండలం